క్లుప్తంగా

గడువు పొడిగింపు

సూర్యాపేట అర్బన్ : గతంలో రూ.1000 చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్లాట్ల యజమానులకు 25శాతం మినహాయింపుతో ఎల్ఆర్ఎస్ ఫీజు కట్టుకోవడానికి ప్రభుత్వం ఈ నెల 31 వరకు గడువును పొడిగించిందని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణవాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఆహ్వానపత్రిక అందిస్తున్న గ్రామస్తులు

తిరుమలగిరి : తిరుమలగిరి మండలం గుండెపురి గ్రామంలోని శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు సోమవారం ఎమ్మెల్యే మందుల సామేల్‌ను హైదరాబాద్‌లో కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. ఉత్సవాల నిర్వహణకు ఎమ్మెల్యే వారికి రూ.25 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ దరావత్ జమ్మిలాల్, ఆలయ వ్యవస్థాపకుడు రామారావు శరత్‌బాబు, బాలకృష్ణ, కె.శ్రీనివాస్, కొమ్ము సోమన్న, సోమయ్య, నరేష్, నాగయ్య, మల్లేష్, సత్తయ్య, రంజిత్, పరశురామ్, సురేష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సూర్యాపేట అర్బన్ : విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్నందున పట్టణంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ఆర్. సురేష్ సోమవారం తెలిపారు. వాణిజ్య భవన్, మధు ట్రావెల్స్ దగ్గర, రామలింగేశ్వర థియేటర్ దగ్గర, విద్యానగర్, బేబీ కేర్ హాస్పిటల్ దగ్గర, రామ్మూర్తి హాస్పిటల్, గణేష్ చౌరస్తా, ఎంఎస్ఆర్ స్కూల్ ప్రాంతాల్లో ఉదయం 08:00 నుంచి 10:00 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

గౌతమ బుద్ధుడి జయంతి



అర్వపల్లిలో గౌతమబుద్ధుడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

అర్వపల్లి : అర్వపల్లిలో సోమవారం ప్రగతిశీల తల్లిదండ్రుల సంఘం ఆధ్వర్యంలో గౌతమ బుద్ధుడి జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో పీపీఎల్ రాష్ట్ర అధ్యక్షుడు మచ్చ నర్సయ్య, పూలే-అంబేద్కర్ ఆశయ పోరాటసమితి వ్యవస్థాపకుడు ఈదురు వీరపాపయ్య, పీపీఎల్ రాష్ట్ర కార్యదర్శి దాసరి శ్రీను, బొడ్డు వెంకట్, చెరుకు రమేష్, సోమ్మల్లు, భిక్షం, కొమిరెల్లి, శ్రీను, వెంకన్న పాల్గొన్నారు.

16న కౌన్సిలింగ్

చివ్వెంల : ఐలాపురం గ్రామ శివారులోని తెలంగాణ గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం హెచ్ఈసీ, సీఈసీ గ్రూపుల్లో చేరే విద్యార్థులకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ భవాని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు పదవ తరగతిలో సాధించిన మార్కుల మెమో, టీసీ, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఒరిజినల్స్, వాటి జిరాక్స్, ఆధార్ కార్డు, 3 కలర్ ఫొటోలతో ఈ నెల 16న మిర్యాలగూడ బాలుర గిరిజన పాఠశాలలో ఉదయం 10 గంటలకు కౌన్సిలింగ్‌కు హాజరుకావాలని సూచించారు. ఆసక్తి గత విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని కొమ్మాల గ్రామం ఎస్సీకాలనీలో ముత్యాలమ్మ దేవాలయ నిర్మాణం కోసం సోమవారం ఆలయ నిర్వాహకులు తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌ను కలువగా ఆయన రూ.50 వేలు విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో జాజిరెడ్డిగూడెం పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి, నిర్వాహకులు సూరారపు వెంకటాద్రి, గంగదెరి శ్రీనివాస్, ఆనంద్, సైదులు, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోళ్లలో కొర్రీ.. రైతుల వర్రీ

- ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో యథేచ్ఛగా దళారుల దందా
- వసతులు కల్పించడంలో నిర్వాహకుల నిర్లక్ష్యం
- కారుమబ్బులతో రైతుల్లో ఆందోళన

తాళ్లగడ్డ (సూర్యాపేట) : ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని అమ్ముకోవడానికి రైతులకు ఇబ్బందులు తప్పడంలేదు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినా వాటిల్లో సౌకర్యాలను విస్మరించింది. అంతేకాకుండా కొనుగోళ్లలో కేంద్రాల నిర్వాహకులు, దళారులు ఇష్టారీతిన చేతివాటం ప్రదర్శిస్తున్నారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కొనుగోలు చేయకుండా..

ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు రైతులకు సౌకర్యాలు ఏర్పాటు చేయకపోగా, దళారులకు సహకరించే క్రమంలో సరైన సమయంలో తూకం వేయకుండా బస్తాలు అందడంలేదని సాకులు చెప్తూ కాలం గడుపుతున్నారు. ఒక వేళ కాంటాలు వేస్తే బస్తాలను ఎత్తడానికి లారీలు అందుబాటులో లేవని రోజుల తరబడి కేంద్రాల్లోనే బస్తాలను ఉంచుతున్నారు. దీంతో రైతులు తీవ్ర వేదనకు గురవుతున్నారు. కాంటాలు వేసిన బస్తాలను ఎత్తడానికి లారీలను రైతులే ఏర్పాటు చేసుకోవాలని నిర్వాహకులు చెప్తున్నారు. దీనికి తోడు తరుగు విషయంలో కొనేముందు ఒకలాగ లోడు ఎత్తిన తర్వాత మిల్లర్లు మరోలాగా ఇబ్బందులకు గురి చేస్తుండటంతో రైతులు నిరాశ చెంది దళారులను ఆశ్రయిస్తున్నారు. దీంతో దళారుల నుంచి నిర్వాహకులు కమీషన్ పొందుతున్నారని రైతులు బాహాటంగానే తెలుపుతున్నారు.



తాళ్లఖమ్మంపహాడ్ వద్ద కొనుకొలు కేంద్రంలో నిల్వ ఉన్న ధాన్యం(ఫైల్)

సూర్యాపేట మండల పరిధిలో ఇలా..

సూర్యాపేట మండల పరిధిలో మొత్తం 37 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉన్నాయి. అందులో ఐకేపీ ఆధ్వర్యంలో 19 కేంద్రాలు ఏర్పాటు చేశారు. అన్ని కేంద్రాల్లోనూ దొడ్డురకం ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటి వరకు 1,72,911 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో 7 కేంద్రాలు ఏర్పాటు చేయగా అందులో 5 దొడ్డురకం ,1 సన్నరకం కేంద్రాలు ఉన్నాయి. వాటిద్వారా ఇప్పటి వరకు 609 మంది రైతుల నుంచి 40,467 క్వింటాళ్ల ధాన్నాన్ని కొనుగోలు చేశారు. మున్సిపాలిటీ పరిధిలో మెప్మా ఆధ్వర్యంలో చివ్వెల మండలం నుంచి బీబీగూడెం, కుడకుడ, రాంకోటి తండా కొనుగోలు కేంద్రాలను కలుపుకొని మొత్తం 11 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. అన్ని కేంద్రాల్లోనూ దొడ్డురకం ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటివరకు 1,144 మంది రైతుల నుంచి 75,725.6 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇంకా కొన్ని కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోయి ఉన్నాయి. కాగా మరికొన్ని కేంద్రాల్లో కాంటాలు వేసి బస్తాలు నిల్వ ఉన్నాయి. ట్రాన్స్‌పోర్ట్ సౌకర్యం లేదని నిర్వాహకులు చేతులెత్తేస్తున్నారు.

సౌకర్యాలు కరువు..

కొనుగోలు కేంద్రాల ప్రారంభ సమయంలో అధికారుల ముందు ఆర్భాటాలు చేస్తూ సౌకర్యాలు కలిగిన కేంద్రంగా చూపించే నిర్వాహకులు, అధికారుల కోసం టెంటు, చల్లని నీరు, కుర్చీలు వంటి వసతులు, సమయానుకూలంగా భోజనాలు సైతం ఏర్పాటు చేసేందుకు వెనకాడరు. అయితే ఆ తర్వాత రైతులకు సౌకర్యాలు కల్పించే విషయంలో మాత్రం తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ధాన్యంలో తేమ శాతాన్ని నిర్ధారించే పరికరాలు, ధాన్యంపై కప్పే టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు వంటివి సరిపడినన్ని సమకూర్చిన పాపానపోలేదు. చివరికి రైతులకు, కూలీలకు, హమాలీలకు నిలువ నీడ కూడా ఏర్పాటుచేయలేదు. కనీసం తాగునీళ్లు కూడా అందుబాటులో ఉంచకపోవడంతో అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులను వివరణ కోరగా అన్ని కేంద్రాల వద్ద సౌకర్యాలు మెండుగా కల్పించినట్లు చెబుతున్నారు. దీన్ని బట్టి కొనుగోలు కేంద్రాల వద్ద అధికారుల పర్యవేక్షణ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

వాతావరణంలో మార్పులతో..

గడిచిన వారం రోజులుగా అక్కడక్కడ కురుస్తున్న అకాల వర్షాల వల్ల కొనుగోలు కేంద్రాల్లో రైతులు భయాందోళనకు గురవుతున్నారు. ఆరబెట్టిన ధాన్యం తడవకుండా ప్రభుత్వం టార్పాలిన్లను అందుబాటులో ఉంచకపోవడంతో ధాన్యం ఏ చిన్న వాన వచ్చినా తడుస్తుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. చేతికొచ్చిన ధాన్యం విక్రయించే సమయంలో నీళ్లపాలు అవుతుందేమోనని భయపడుతున్నారు. ఇప్పటికైనా ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని రైతులు అధికారులు, నిర్వాహకులను కోరుతున్నారు.

వెంటనే కొనుగోలు చేయాలి



రైతులు పండించిన పంటను వెంటనే కొనుగోలు చేయాలి. ఇప్పటికే చాలా రోజులుగా రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే పడిగాపులు కాస్తున్నారు. కేంద్రం నిర్వాహకులు రైతుల బస్తాలను మిల్లులకు ఎత్తడానికి లారీలు, డీసీఎంలు తెచ్చుకోవాలని చెప్పడం సరికాదు. రైతులు పండించిన ధాన్యం కొనుగోలు ద్వారా ఆదాయం పొందుతున్న ప్రభుత్వం .. అదే రైతులకు సదుపాయాలు కల్పించడంలో మాత్రం బాధ్యతా రహితంగా వ్యవహరిస్తోంది. సత్వరమే అన్ని కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న ధాన్యాన్ని కాంటాలు వేసి ట్రాన్స్‌పోర్ట్ చేయాలి.

- సంకరమద్ది రమణారెడ్డి, రైతు, కాసరబాద్

కాంటాలు వేసి వదిలేశారు



ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకుల తీరువల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి సుమారు నెలరోజులైనా వచ్చిన ధాన్యం వచ్చినట్టే ఉంది. కాంటాలు వేసిన ధాన్యం బస్తాలను ఎత్తకుండా ఉంచడంతో ఎప్పుడు వర్షం వస్తుందోనని రైతులు కొనుగోలు కేంద్రాల వద్దనే కాపలా కాస్తున్నారు. కాంటాలు వేసిన బస్తాలను ఎత్తడానికి లారీ, హమాలీల ఖర్చులు రైతులు ఇవ్వాలని నిర్వాహకులు అనడం బాధకలిగిస్తోంది. మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేసి వెంటనే లారీల ద్వారా ఎగుమతి చేయాలి.

- కప్పల సైదులు, రైతు, తాళ్లఖమ్మంపహాడ్

పోలీస్ సిబ్బంది సంక్షేమానికి కృషి



కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎస్పీ



బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ

- ఎస్పీ కె.నరసింహా

సూర్యాపేటటౌన్ : పోలీస్ సిబ్బంది, కుటుంబాల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ పోలీస్ శాఖ కృషి చేస్తోందని ఎస్పీ కె.నరసింహా అన్నారు. కోదాడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ రాంబాబు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించగా పోలీస్ చేయూత పథకం ద్వారా బాధిత కుటుంబ సభ్యులకు సోమవారం రూ.2లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. రాంబాబు కుటుంబాన్ని పోలీస్‌శాఖ అన్ని విధాల ఆదుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ జనార్దన్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ నాగభూషణరావు, పోలీస్ సంఘం జిల్లా అధ్యక్షుడు రామచందర్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఉంటాం..

బాధితులకు అండగా ఉంటామని, ఫిర్యాదులపై వెంటనే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్పీ నరసింహా అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజావాణి సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఫిర్యాదుదారులకు భరోసా కల్పించాలని, బాధితులకు న్యాయం చేయడంలో వేగంగా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు.

పేదలకు ఇళ్లు మంజూరు చేయాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

భానుపురి : జిల్లాలోని చివ్వెంల మండలం కుడకుడ గ్రామశివారు సర్వే నంబర్ 126, నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 243, 244 ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుని జీవిస్తున్న పేదలకు శాశ్వత పట్టాలిచ్చి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ అన్నారు. సోమవారం ఈ మేరకు కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆరు సంవత్సరాలుగా పేదలకు ఇళ్లస్థలాలు కావాలని పోరాడుతూ అనేక కేసుల పాలైనట్లు తెలిపారు. అనేక పోరాటాల ఫలితంగా గత సంవత్సరం ప్రభుత్వం పేదలకు గుడిసెలేసుకొని జీవించే అవకాశం కల్పించిందని తెలిపారు. ఈ విషయమై కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ విచారణ చేపట్టాలని అదనపు కలెక్టర్‌ను ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్ర అఖిల్, ఏఐపీకేఎంఎస్ నాయకులు పేర్ల నాగన్న, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల ఎంపికపై కలెక్టర్‌కు ఫిర్యాదు

నాగారం : నాగారం మండల పరిధిలోని ఈటూరు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక పారదర్శకంగా జరగడం లేదంటూ గ్రామానికి చెందిన సామాజిక ఉద్యమకారుడు పేరాల గోపి సోమవారం సూర్యాపేటలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈటూరులో ఇందిరమ్మ ఇళ్ల ఎంపికపై మరోసారి విచారణ చేపట్టాలని, అర్హులైన వారికి ఇళ్లు కేటాయించాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు.

కార్మిక చట్టాల జోలికి వస్తే ఊరుకోం



సూర్యాపేటలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

సూర్యాపేట అర్బన్ : కార్మిక చట్టాల జోలికి వస్తే ఊరుకోమని, కార్పొరేట్ విధానాలను పాతాళానికి తొక్కుతామని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా నాగయ్య అన్నారు. ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె పోస్టర్‌ను సోమవారం పట్టణంలో ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, ఐఎఫ్‌టీయూ జిల్లా కమిటీ సభ్యుడు సామ నర్సిరెడ్డి, హమాలీ యూనియన్ నాయకులు మడిపడిగా పురుషోత్తం, పాలబిందెల వెంకన్న, జాలె గురుమల్లు, ఖమ్మపాటి రమేష్ పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

తుంగతుర్తి : దేశవ్యాప్తంగా ఈ నెల 20న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొలిశెట్టి యాదగిరి రావు కోరారు. సోమవారం మండల కేంద్రంలో కందాల శంకర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సీపీఎం ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బుర్ర శ్రీనివాసు, పులుసు సత్యం, మండల కార్యదర్శి వద్దే శ్రీనివాస్, పోలోజు సైదులు, గుమ్మడవెల్లి ఉప్పలయ్య, దేవరకొండ యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : కార్మిక చట్టాల రక్షణ, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం దేశ వ్యాప్తంగా ఈనెల 20న జరిగే సార్వత్రిక సమ్మెలో ప్రతి కార్మికుడు పాల్గొనాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు కోరారు. పర్సాయపల్లిలో సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సభ్యత్వాల నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేస్తూ 4 లేబర్‌కోడ్‌లను ఏర్పాటు చేసిందని, దీని ద్వారా కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులు పోయాయని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి పులుసు సత్యం, ఎస్.అబ్బులు, దేవరకొండ యాదగిరి, చెన్నబోయిన వీరయ్య, శిగ శ్రీను పాల్గొన్నారు.

అమరుల ఆశయ సాధనకు ఐక్యం కావాలి



మాట్లాడుతున్న మల్లు నాగార్జునరెడ్డి

ఆత్మకూర్(ఎస్): అమరవీరుల ఆశయ సాధన కోసం కమ్యూనిస్టుల ఐక్యత అవసరమని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి అన్నారు. సోమవారం ఏపూరులో ఎంసీపీఐ(యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల ఓంకార్ శత జయంతి వార్షికోత్సవ సభలో పాల్గొని మాట్లాడారు. భూమి, భుక్తి, విముక్తి కోసం జరిగిన పోరాటంలో మద్దికాయల ఓంకార్ అగ్రభాగాన నిలిచాడని అన్నారు. భీంరెడ్డి నరసింహారెడ్డి, మల్లు స్వరాజ్యంలతోపాటు ప్రజా సమస్యలపై పోరాడి ఎర్ర జెండాకు వన్నెతెచ్చిన నేత ఓంకార్ అని కొనియాడారు. ఈ సందర్భంగా గ్రామంలో కాగడాలతో భారీ ప్రదర్శన నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి అవిరె అప్పయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, ఓంకార్ పెద్ద కుమారుడు మద్దికా యల సుధాకర్, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు, ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వరికుప్పల వెంకన్న, వసుకుల మట్టయ్య, షేక్ నజీర్, మట్టిపల్లి సైదులు, కోట గోపి, దండ వెంకటరెడ్డి, బెల్లంకొండ వెంకటేశ్వర్లు, ధనియాకుల శ్రీకాంత్, వేల్పుల వెంకన్న, వీరబోయిన రవి, బెల్లంకొండ సత్యనారాయణ, మద్దికాయల ప్రభావతి, అబ్బగాని భిక్షం, సుధగాని వెంకన్న, జిలేరు, సానబోయిన ఉపేందర్, రాంబాబు పాల్గొన్నారు.

డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన

నాగారం : గంజాయి, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ఫణిగిరి గ్రామంలో సోమవారం తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం సభ్యులు ప్రజలకు, యువతకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక సారథి జిల్లా టీం లీడర్ పాలకుర్తి శ్రీకాంత్ మాట్లాడారు. గంజాయి, డ్రగ్స్ మాదకద్రవ్యాలను నిర్మూలించడంలో ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఒట్టే సురేష్, సాంస్కృతిక సారథి కళాబృందం సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు నియమాలు పాటించాలి

మద్దిరాల : ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఎస్ఐ వీరన్న అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. పోలీస్ భరోసా కార్యక్రమం, రోడ్డు ప్రమాదాల నివారణ తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ సాలయ్య, పోలీస్ కళాబృందం సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పైలట్ ప్రాజెక్టు ఇళ్ల నిర్మాణాల పరిశీలన



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న హౌసింగ్ ఏఈఈ

నాగారం : మండల పరిధిలోని లక్ష్మాపురం గ్రామంలో పైలట్ ప్రాజెక్టు కింద మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను సోమవారం హౌసింగ్ ఏఈఈ కాసాని మౌనిక పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. లక్ష్మాపురంలో పైలట్ ప్రాజెక్టులో భాగంగా మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. బేస్మెంట్ నిర్మాణం పూర్తయితే రూ.1,00,000 లబ్ధిదారుల అకౌంట్‌లో జమవుతాయని తెలిపారు. లబ్ధిదారులు 540 స్క్వేర్ ఫీట్స్ విస్తీర్ణంలో మాత్రమే ఇంటిని నిర్మించుకోవాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన విస్తీర్ణం వరకే ఇంటి నిర్మాణం చేసుకోవాలని, ఎక్కువ విస్తీర్ణంలో ఇంటిని నిర్మించికుంటే బిల్లులు మంజూరు కావని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి.గోపి, నాయకులు మల్లెపాక వెంకటయ్య, తడకమళ్ల నాగమల్లయ్య, చిప్పలపెల్లి శ్రీను, శాగంటి అంజయ్య, చిప్పలపల్లి సలీం, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కనకదుర్గ, తుల్జాభవాని వేడుకలు



రామన్నగూడెం తండాలో కనకదుర్గ ఆలయం వద్ద నీళ్లారబోస్తున్న గిరిజన మహిళలు

అర్వపల్లి: రామన్నగూడెంతండాలో సోమవారం కనకదుర్గ, తుల్జాభవాని దేవతల ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మహిళలు ఇళ్ల నుంచి జలబిందెలతో ఊరేగింపుగా వెళ్లి కనకదుర్గ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి నీళ్లారబోశారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గిరిజన భాషలో పాటలు పాడారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, తండావాసులు పాల్గొన్నారు.

ఆలయాల్లో కొనసాగుతున్న ఉత్సవాలు



తాళ్లగడ్డ (సూర్యాపేట) : మంగళసూత్రం చూపుతున్న అర్చకులు



తాళ్లగడ్డ (సూర్యాపేట) : శ్రీనివాసుడి కల్యాణ వేడుకల్లో పాల్గొన్న భక్తులు

తాళ్లగడ్డ (సూర్యాపేట) : సూర్యాపేట పట్టణంలోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాల ఆచార్యులు ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం పద్మావతి శ్రీనివాస కల్యాణం నిర్వహించారు.భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా శ్రీలక్ష్మీనర్సింహస్వామి కల్యాణం

చివ్వెంల: ఉండ్రుగొండ శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి స్వాతీ నక్షత్రయుక్త నృసింహ జయంతి సందర్భంగా స్వామివారి కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు అరవిందాచార్యులు, శ్రీమాన్ క్రిష్ణమాచార్యులు మంత్రోచ్చరణతో స్వామి వారికి పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేతంగా వివాహం జరిపించారు. 200 మంది భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. మంగళవారం వైశాఖ మాస పౌర్ణమి సందర్భంగా నారసింహ హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆల య కమిటీ చైర్మన్ చకిలం క్రిష్ణకుమార్, బందకవి క్రిష్ణమోహన్, రామయ్య పాల్గొన్నారు.

చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు

ఆత్మకూర్ (ఎస్) : మండల కేంద్రంలో శ్రీభూగోదాసమేత చెన్నకేశవ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా సోమవారం గరుడ ముద్ద కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. శ్రీమాన్ కారంపొడి అనంత ఆచార్య స్వామి ఆధ్వర్యంలో ప్రాతః ఆరాధన, ద్వారతోరణ పూజ, కుంభారాధన, బలిహరణం, గరుడ హోమం, ధ్వజారోహణం నిర్వహించారు. అనంతరం దేవాలయంలో గరుడ ముద్ద కార్యక్రమం జరిపారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని గరుడ ముద్దను అందుకునేందుకు పోటీపడ్డారు. అనంతరం ఆరగింపు కార్యక్రమం నిర్వహించి అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అర్చకబృందం, భక్తులు పాల్గొన్నారు.



చివ్వెంల : కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు



ఆత్మకూర్(ఎస్) : చెన్నకేశవస్వామి ఆలయంలో వేడుకల్లో పాల్గొన్న భక్తులు

సంక్షిప్త సమాచారం

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

అర్వపల్లి : మండల పరిధిలోని బొల్లంపల్లి గ్రామానికి చెందిన సందినపోయిన నర్సయ్యకు రూ.60వేలు, కొలుకులపల్లి విఘ్నేష్‌కు రూ.16వేలు చొప్పున మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను స్థానిక నాయకులు సోమవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ కార్యదర్శి కేసాని రాహుల్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు ఖమ్మంపాటి వెంకటేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ జహంగీర్‌పాష, ఖమ్మంపాటి మహేష్ పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయాలి

అర్వపల్లి : అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరుచేయాలని పూలే-అంబేద్కర్ ఆశయ పోరాటసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఈదురు వీరపాపయ్య అధికారులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం అర్వపల్లిలో విలేకరులతో మాట్లాడారు. గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్లను అధికార పార్టీ వారికే కేటాయిస్తున్నారని చెప్పారు.

16న మారోజు వీరన్న వర్ధంతి

తుంగతుర్తి : ఈ నెల 16న మారోజు వీరన్న వర్ధంతి నిర్వహిస్తున్నట్లు ఉద్యమ నాయకుడు నాయకుడు మట్టపల్లి సంతోష్ తెలిపారు. సోమవారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడారు. తుంగతుర్తి మండలంలోని కొత్తగూడెంలో మే 16న మారోజు వీరన్న వర్ధంతి సభ, అలాగే మే 26న భువనగిరిలో బెల్లి లలితక్క వర్ధంతి సభలు ఉంటాయని అన్నారు. సభల్లో తీన్మార్ మల్లన్న, వట్టే జానయ్య, ఏపూరి సోమన్న, సుధగాని హరిశంకర్ గౌడ్, బెల్లి కృష్ణ, సంగెం సూర్యారావు పాల్గొంటారని తెలిపారు.

నాగయ్య మృతి తీరని లోటు

నూతనకల్ : మండల పరిధిలోని మిర్యాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వేల్పుల నాగయ్య మృతి పార్టీకి తీరని లోటని మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి అన్నారు. సోమవారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దరిపెల్లి వీరన్న, అనంతుల శ్రీనివాస్, గోరుగంటి రాంచందర్‌రావు, పసుల అశోక్ యాదవ్, సామ సుధాకర్‌రెడ్డి, మెంచు లింగమల్లు, కొమ్ము పరమేష్, కాస శంకర్, వేల్పుల రఘు, బొల్క సైదులు తదితరులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలి

నాగారం : మండల పరిధిలోని పసునూర్ గ్రామంలో ఈ నెల 17న నిర్వహించే బీఆర్ అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రామ్‌ల విగ్రహావిష్కరణ సభను విజయవంతం చేయాలని మాదిగ కళామండలి రాష్ట్ర అధ్యక్షుడు మల్లేపాక అనిల్‌కుమార్ మాదిగ కోరారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. విగ్రహాల ఆవిష్కరణకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ, ఎమ్మెల్యే మందుల సామేల్, బహుజన యుద్ధనౌక ఏపూరి సోమన్నలు హాజరవుతారని తెలిపారు. ఆయనతో పాటు విగ్రహ ప్రతిష్ఠ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

అందాల పోటీలను అడ్డుకోకుండా ముందస్తు అరెస్టులు

ఆత్మకూర్(ఎస్) : అందాల పోటీలను అడ్డుకోకుండా ముందస్తుగా విప్లవ, ప్రజాస్వామిక, మహిళా సంఘాల నాయకులను పోలీసులు సోమవారం ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పీవైఎల్ జిల్లా కార్యదర్శి నల్లగొండ నాగయ్య, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కంచర్ల నర్సక్క మాట్లాడారు. రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉందని చెప్తున్న ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి అందాల పోటీలు నిర్వహించడం సరికాదని అన్నారు. అక్రమ అరెస్టులు చేయొద్దని, అరెస్టయిన వారిని వెంటనే విడుదల చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం డివిజన్ కార్యదర్శి అలుగుబెల్లి వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోరెండ్ల దశరథ, వీరన్న నాయక్, గౌస్ పాల్గొన్నారు.

అర్వపల్లి : అందాల పోటీలను అడ్డుకోకుండా ముందస్తుగా ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్‌లను జాజిరెడ్డిగూడెం మండల పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేయలేని ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చుచేసి అందాల పోటీలు నిర్వహించడం ఏమిటని ప్రశ్నించారు. అందాల పోటీలను వెంటనే నిలిపివేసి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

బీజేపీ నాయకుల పూజలు

నూతనకల్ : భారత్-పాకిస్తాన్ యుద్ధంలో భారత సైనికులు ప్రదర్శించిన ప్రతిభకు మద్దతుగా బీజేపీ నాయకులు నూతనకల్ మండల కేంద్రంలోని శ్రీశంభులింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఉగ్రవాదులను అంతమొందించడం కోసం ప్రధాని మోదీ పాకిస్తాన్‌పై దాడులు జరపడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కాప రవి, జిల్లా కౌన్సిల్ మెంబర్ బత్తిని లక్ష్మయ్య, ముత్యం వీరబాబు, అనంతుల మల్లేశ్వరి, యశ్వంత్, ఉమ తదితరులు పాల్గొన్నారు.